సాక్షి
వికారాబాద్

గురువారం । 4 । జూలై । 2024



మల్చింగ్ సాగు.. దిగుబడి బాగు

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ రంగంలో సరికొత్త మెళకు వలతో ముందుకు సాగుతున్నారు. 8లో▸



పల్లెల్లో గట్టు పంచాయితీలు!

దౌల్తాబాద్‌కు చెందిన ఓ రైతు గతేడాదిలో భూమి కొలత కోసం మీసేవలో దరఖాస్తు చేసినా నేటికీ సర్వే చేయలేదు. 9లో▸



సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుద్యాల్ పంచాయతీ ప్రత్యేక అధికారి దానయ్య సూచించారు. 9లో▸

న్యూస్‌రీల్

పీఆర్‌సీ బకాయిల విడుదలపై హర్షం

సీఎం రేవంత్‌రెడ్డికి గోపాలమిత్రల కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రవీందర్, గోపాలమిత్రలు

కొడంగల్ రూరల్: పశు గణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు సంబంధించి పెండింగ్ పీఆర్సీ తోపాటు వేతనాలు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గోపాలమిత్రలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో గోపాలమిత్ర జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గోపాలమిత్రలు రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని వినతిపత్రం అందజేశారు. పశు గణాభివృద్ధి శాఖలో 23 ఏళ్లుగా 1,530మంది గోపాలమిత్రలు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పశువులకు కృత్రిమ గర్భధారణ, టీకాలు వేయడం, పశు బీమా చేయించడం, పశు వైద్యుల పర్యవేక్షణలో ప్రథమ చికిత్సలు నిర్వహించడం, పశు గ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తమ సేవలను గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు మహేష్, బందయ్య, బిచ్చిరెడ్డి, రఘురామకృష్ణ, శివకుమార్, విశ్వనాథ్, దశరథం, ఎండీ.ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పండిస్తే ప్రభుత్వ పథకాలు కట్



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

అనంతగిరి: గంజాయి పండించే వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవని జిల్లా ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎక్సైజ్, విద్యాశాఖ, జిల్లా సంక్షేమ శాఖ, రెవెన్యూ, అగ్రికల్చరల్, పోలీస్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్‌ను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అన్ని విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలన్నారు. యాంటీ డ్రగ్ కమిటీలో పోలీసులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉండాలన్నారు. గంజాయి నిర్మూలనపై అవగాహన ర్యాలీలు, విద్యార్థులకు వ్యాస రచన, డాన్స్ పోటీలు నిర్వహించాలని సూచించారు. హాస్టళ్లలో తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. అనంతరం అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి విక్రయించే వారు చెప్పే మాయమాటలకు రైతులు ఆశపడరాదన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్, అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎఫ్ఆర్ఓల సస్పెన్షన్

తునికాకు కూలీల బోనస్ డబ్బు కాజేసిన ఘటనలో వేటు





సస్పెన్షన్‌కు గురైన శ్యాంసుందర్, అరుణ

వికారాబాద్: ఇద్దరు ఫారెస్టు రేంజ్ అధికారులపై ఆ శాఖ ఉన్నతాధికారులు వేటు వేశారు. బీడీ కార్మికులకు చెందిన తునికాకు బోనస్ డబ్బులు కాజేసిన విషయాన్ని సాక్షి దినపత్రికలో బీడీ లీఫ్ బోనస్ డబ్బులు పక్కదారి అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై అప్పట్లో విజిలెన్స్ అధికారులు జిల్లాలో పర్యటించి వివరాలు సేకరించారు. అవినీతి జరిగింది వాస్తవమని తేలడంతో అటవీ శాఖచీఫ్ కన్జర్వేటర్ బుధవారం జిల్లాకు చెందిన ఇద్దరు ఫారెస్టు అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండైన వారిలో తాండూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్, వికారాబాద్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అరుణ ఉన్నారు.

ఉన్నతాధికారులపై ఆరోపణలు

తునికాకు బోనస్ డబ్బుల స్వాహాలో జిల్లాస్థాయి ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉన్నట్టు గతంలో ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారం నుంచి తప్పించుకోవటానికి ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌పై తప్పు మోపారు. అతని వల్లే ఇదంతా జరిగిందని విచారణ జరుగుతున్న సమయంలోనే జిల్లా ఫారెస్టు అధికారి ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్..

రూ.10 లక్షలు స్వాహా

2017లో జిల్లాలో కూలీలు తునికాకు సేకరించారు. ప్రభుత్వం ఆకును విక్రయించిన సమయంలో అధిక ధర రావడంతో లాభాలను కూలీలకు బోనస్‌గా ప్రకటించింది. ఆ డబ్బులు ఈ ఏడాది విడుదల చేశారు. అయితే కూలీల ఖాతాల్లో జమ చేయాల్సిన నగదును అధికారులు కాజేశారు. వికారాబాద్ రేంజ్ పరిధిలో రూ.7.5 లక్షలు, తాండూరు రేంజ్ పరిధిలో రూ.2.5 లక్షలు కూలీల బోనస్ డబ్బులను అధికారులు కాజేసినట్లు విజిలెన్స్ అధికారులు తేల్చారు. దీంతో వికారాబాద్, తాండూరు ఎఫ్ఆర్ఓలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం ఆధారంగానే విచారణ జరిపి చర్యలు తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డబుల్ లేన్ సర్వే



- వికారాబాద్ నుంచి పర్లీ వరకు రైల్వేలేన్ పనులు
- దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డీఎం బర్దిశ్‌కుమార్ జైన్



జహీరాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న డీఆర్ఎం బర్దిశ్‌కుమార్‌జైన్

జహీరాబాద్: వికారాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా పర్లి వరకు డబుల్ రైల్వే లేన్‌కు సర్వే పనులు చేపట్టినట్లు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ బర్దిష్‌కుమార్ జైన్ తెలిపారు. బుధవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. అమృత్ భారత్ పథకం కింద రూ.24కోట్లతో నిర్మితం అవుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చేపట్టిన పనులను మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వీలుగా అమృత్ భారత్ పథకం కింద గుర్తించిన రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. వాటి పనులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. వికారాబాద్ నుంచి పర్లి వరకు సింగిల్ లేన్ మాత్రమే ఉన్నందున దీన్ని డబుల్ లేన్ చేసేందుకు వీలుగా సర్వే పనులు చేపట్టామన్నారు. సర్వే నివేదిక అనంతరం డబుల్ లేన్ అవసరంపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం సింగిల్ లేన్ ఉన్నందున మరిన్ని రైళ్లను నడపలేకపోతున్నామన్నారు. క్రాసింగ్ ఇబ్బందులున్నాయని చెప్పారు. జహీరాబాద్–తాండూర్‌ల మధ్య సైతం కొత్త రైల్వే లేన్ ఏర్పాటు కోసం సర్వే పనులు కొనసాగుతున్నాయన్నారు. జహీరాబాద్‌కు మరో ఇంటర్‌సిటీ రైలు నడపాలని, కోహీర్ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాప్ సదుపాయం కల్పించాలనే విషయమై అడుగగా ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తే పరిశీలిస్తామన్నారు. డీఆర్ఎం వెంట ఏడీఆర్ఎంలు సుబ్రహ్మణ్యం, గోపాల్, స్టేషన్ మాస్టర్ మాధవక్రిష్ణ ఉన్నారు.

తిరుపతి రైలు నిలపాలని బీజేపీ నేతల వినతి

జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో తిరుపతి రైలుకు స్టాప్ ఇవ్వలేదని, వెంటనే స్టాప్ సదుపాయం కల్పించాలని బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ గుప్త, బక్కయ్యగుప్తలు డీఆర్ఎంను కోరారు. ఆ మేరకు వినతి పత్రం ఇచ్చారు. ఇంటర్ సిటీ రైలు తిరుగు ప్రయాణంలో సమయానికి రావడం లేదని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమయానుసారంగా నడిపేలా చూడాలని కోరారు. కల్‌బుర్గి–బీదర్‌ల మధ్య నడుస్తున్న డెమో రైలును జహీరాబాద్ వరకు పొడిగించాలని కోరారు. వీటిని పరిశీలించి పరిష్కరించేలా చూస్తానని హామీఇచ్చారు.

బెర్త్ ఎవరికో..

హస్తినకు చేరిన 'విస్తరణ'

- మంత్రివర్గంలో చోటుపై ఎమ్మెల్యేల లాబీయింగ్
- మల్‌రెడ్డికా.. రామ్మోహన్‌రెడ్డికా అనేదానిపై సర్వత్రా చర్చ





సాక్షి, రంగారెడ్డిజిల్లా: మంత్రి వర్గంలో బెర్త్‌ల పంచాయితీ హస్తినకు చేరింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు మంత్రి వర్గంలో చోటు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీ వేదికగా లాబీయింగ్ చేస్తున్నారు. అభిమానులు ఇప్పటికే తమ నేత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. అభినందనలు తెలుపుతూ వాట్సాప్ గ్రూపుల్లో ఫొటోలు షేర్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎవరికి మంత్రి వర్గంలో చోటు లభించనుందనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఒకటి రెండు రోజుల్లో మంత్రి వర్గ విస్తరణ ఉండనున్నట్లు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి ఇప్పటికే సీఎంగా బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ నియోజవర్గం నుంచి గెలుపొందిన గడ్డం ప్రసాద్‌కుమార్ అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతి నిధ్యం కల్పించ లేదు. తాజా మంత్రివర్గ విస్తరణలో రంగారెడ్డి జిల్లా నేతలకు అవకాశం కల్పించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి గెలుపొందిన మల్‌రెడ్డి రంగారెడ్డికి అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయన ఢిల్లీకి చేరుకున్నారు. రెండు రోజుల నుంచి అక్కడే మకాం వేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా అధిష్టానానికి ఆయన పేరును సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వికారాబాద్ జిల్లా పరిగి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కూడా పోటీలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒకరు సీఎం, మరొకరు స్పీకర్ పదవుల్లో కొనసాగుతున్నారు. మళ్లీ అదే జిల్లాకు చెందిన వ్యక్తికి మంత్రి వర్గంలో చోటు కల్పిస్తే రంగారెడ్డి జిల్లా నేతల నుంచి వ్యతిరేకత వస్తుందనే అభిప్రాయం కూడా ఉంది. దీనిలో భాగంగానే మల్‌రెడ్డికి డిప్యూటీ స్పీకర్ పదవిని కట్టబెట్టనున్నట్లు తెలిసింది. అయితే ఆయన కీలక పోర్ట్ పోలియో కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి సహా మరో ఎమ్మెల్యే కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అధిష్టానం నుంచి హామీ వచ్చిన వెంటనే వీరు పార్టీ మారే అవకాశం కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.



బంట్వారం: సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ ఈశ్వరయ్య

అర్హులకే రైతు భరోసా ఇవ్వాలి

- అన్నదాతల సూచన
- అభిప్రాయాలు సేకరించిన డీసీఓ ఈశ్వరయ్య

బంట్వారం: రైతు భరోసా పథకం అమలుకు సంబంధించి అన్నదాతలు తమ అమూల్యమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి (డీసీఓ) ఈశ్వరయ్య కోరారు. బుధవారం బంట్వారంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతు భరోసాపై సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా కాకుండా అర్హులకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. పది ఎకరాల వరకు పథకం వర్తింపజేయాలని రైతులు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, ఆయా గ్రామాల రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాయితీ పనిముట్లు ఇవ్వాలి

మర్పల్లి: రైతులు దేశానికి వెన్నెముకలాంటి వారని డీసీఓ ఈశ్వరయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్ద మర్పల్లి సహకార సంఘంలో రైతు భరోసా పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రైతుల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. గతంలో మాదిరిగా రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని రైతులు కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ రవీందర్, ఏఓ వసంత, ఏఈఓ నీరజ, సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఫసీయొద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు రామేశ్వర్, ఆయా గ్రామాల డైరెక్టర్లు మల్లారెడ్డి, జగదీష్, నారాయణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ



ఎన్నెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వాకాటి కరుణ, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

అనంతగిరి: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు బోధించే పాఠ్య ప్రణాళిక, ఆట పాటలపై సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటల తోపాటు ప్రాథమిక విద్యను అందించాలని ఆదేశించారు. షామ్ (అతి తీవ్ర లోప పోషణ), మామ్ (తీవ్ర లోప పోషణ) పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం, బాలామృతం ఇవ్వాలని సూచించారు. గ్రామాల వారీగా ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలతో పాటు రాష్ట్రీయ బాల స్వాస్థ్య బృందాలతో కలిసి అంగవైకల్యం, బుద్ధి మాంద్యం పిల్లలను గుర్తించి వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో 1,079 మంది దివ్యాంగులు ఉన్నారని, నెలలోపు సదరం క్యాంపులు నిర్వహించి గుర్తింపు కార్డులను అందజేయాలని ఆదేశించారు. దివ్యాంగులకు రిజర్వేషన్ల ప్రాతిపదికన అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. బుద్ధి మాంద్యం, బధిరుల సౌకర్యార్థం మండల కేంద్రాల్లో భవిత కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ, పునరావాసం కల్పించడం జరుగుతుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

అనంతరం వికారాబాద్ పట్టణ పరిధిలోని ఎన్నేపల్లి, శివారెడ్డి పేటలో గల అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి వాకాటి కరుణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అభ్యసిస్తున్న పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజా, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ పల్వాన్‌కుమార్, డీసీహెచ్ఎస్ ప్రదీప్ కుమార్, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జేపీ నడ్డాను కలిసిన మారుతీకిరణ్



పరిగి: బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాను బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి నియోకవర్గ అభివృద్ధిపై చర్చించారు. పరిగిలో బీజేపీ జెండా ఎగు రవేసే విధంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారన్నారు.

విరివిగా మొక్కలు నాటండి

తలకొండపల్లి: విరివిగా మొక్కలు నాటి పచ్చదనం వెల్లివిరిసేలా గ్రామాలను తీర్చిదిద్దాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ పేర్కొన్నారు. పచ్చని చెట్లు–ప్రగతికి మెట్లని, చెట్లుంటే క్షేమం, లేకుంటే క్షామం అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో బుధవారం టీఎస్ ఎస్ఓ ఆధ్వర్యంలో తహసీల్దార్ రంగారెడ్డితో కలిసి మొక్కలు నాటారు.

రాష్ట్రాన్ని పాలించే సత్తా కేసీఆర్‌కే ఉంది



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నరేందర్‌రెడ్డి తదితరులు

- సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ మోసం చేసింది
- బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం
- మాకు పార్టీ మారే అవసరం లేదు
- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. తమకు పార్టీ మారే అవసరం లేదన్నారు. రాష్ట్రాన్ని పాలించే సత్తా కేసీఆర్‌కు మాత్రమే ఉందన్నారు. కాంగ్రెస్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తాము ఎల్లప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ డబ్బులు అర్హులకు అందడం లేదన్నారు. తులం బంగారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా, ఆసరా పింఛన్ మొత్తం పెంచలేదన్నారు. రుణ మాఫీపై స్పష్టత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఇకపై దాడులకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ప్రజాప్రతినిధి కాకున్నా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని విమర్శించారు. మళ్లీ ఆయన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటే తాము కూడా వస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్యాసం రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, మహిపాల్, చాంద్‌పాషా, యాదగిరి, దేశ్యానాయక్, సలీం, రమేష్‌బాబు, శేరి నారాయణరెడ్డి, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల అందజేత

బంట్వారం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండలం బుగ్గాపూర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల హామీలను తమ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందన్నారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఆగస్టు మాసంలో ఒకే దఫాలో రూ.2లక్షల రైతు రుణమాఫీ అమలు చేస్తామని ప్రకటించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకాన్ని అమలు చేసినట్లు గుర్తు చేశారు. ఏది ఏమైనా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి సబ్సిడీ ఎరువులను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. అంతకుముందు కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంతో సంబంధిత మార్కెటింగ్ అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కోట్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన పలువురు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ బుధవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జి అడిషనల్‌ కలెక్టర్‌గా సుధీర్‌కుమార్‌



అనంతగిరి: జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌(స్థానిక సంస్థలు)గా జెడ్పీ సీఈఓ సుధీర్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ స్థానిక సంస్థల అడిషనల్‌ కలెక్టర్‌గా పనిచేసిన రాహుల్‌ శర్మ కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం విదితమే.

పట్టాలు దాటుతుండగా..

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

తాండూరు టౌన్‌: పట్టాలు దాటుతున్న ఓ వృద్ధుడు రైలు ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం తాండూరు రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం .. పట్టణంలోని షావుకార్‌పేట్‌కు చెందిన బిచ్చప్ప(80) పాత తాండూరు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌ ఆవరణలో ప్లాట్‌ఫాం చివర నుంచి పట్టాలు దాటుతున్నాడు. ఇదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ బిచ్చప్పను ఢీకొట్టడంతో పక్కకు పడిపోయాడు. గమనించిన స్థానికులు ఆయన్ను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందగా పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబీకులకు అప్పగించామన్నారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు సంతానం.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ఎస్పీ నారాయణరెడ్డి



బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

ధారూరు: విధులు సక్రమంగా నిర్వహిస్తూ కుటుంబాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ధారూరు ఠాణాను పరిశీలించారు. స్టేషన్‌ ఆవరణను చూసి సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వచ్చేవారిపై సౌమ్యంగా ఉండాలన్నారు. ప్రతీ రికార్డును సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌గౌడ్‌, స్టేషన్‌ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా రైల్వే లైన్‌ సర్వే



డ్రోన్‌ కెమెరాతో చేస్తున్న రైల్వే లైన్‌ సర్వే

పెద్దేముల్‌: తాండూరు–జహీరాబాద్‌ రైల్వే సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం మండల పరిధిలోని నాగులపల్లి, రుద్రారం మీదుగా డ్రోన్‌ సర్వే చేపట్టారు. డ్రోన్‌ శబ్దం విన్న రైతులు భయాందోళన చెందారు. సర్వేయర్‌ గంట తర్వాత గోపాల్‌పూర్‌–రుద్రారం మధ్య ఓ సుద్ద ఫ్యాక్టరీ వద్ద డ్రోన్‌ కెమెరాను కిందకు దించడంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లి ఆసక్తిగా తిలకించారు. బుల్లెట్‌ ట్రైన్‌ లైన్‌ కోసం సర్వే చేస్తున్నామనడంతో రైతులు తమకు రైలు ప్రయాణం సౌకర్యం ఉంటుందని ఆనందం వ్యక్తం చేశారు.

జాతీయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్‌: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2023కు గాను అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ఎంహెచ్‌ఆర్‌డీ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని జిల్లా విద్యాధికారి సుశీందర్‌ రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు కాపీలను డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

బట్టేల్‌గుట్ట.. జిగేల్‌మనేట్టు



ధ్యానముద్రలో బుద్ధుడి విగ్రహం



వాకింగ్‌ ట్రాక్‌

- రెండు వేల మీటర్ల ఎత్తులో గుట్ట బురుజు
- ఆధునీకీకరణ పనులకు రూ.2.5కోట్లు

బడంగ్‌పేట్‌: బడా జంగ్‌పేట్‌ అంటే నైజాంల సైనిక స్థావరం. చుట్టూ 30 అడుగుల ఎత్తులో కోట గోడ, మధ్యలో సైన్యం, కోటగోడ కింద రాణిగారి నివాసం (కొన్ని ఏళ్లు ఇక్కడే పంచాయతీ పాలన) కోట గోడ మధ్యలో 2వేల మీటర్ల ఎత్తులో బట్టేల్‌ గుట్ట బురుజును ఏర్పాటు చేశారు. శత్రు సైన్యం రాకను పసిగట్టి ఎదురుదాడి చేసేవారని చారిత్రక ఆధారాలున్నాయి. రాణి నివాసం, స్నాన తటాకం, మెట్లబావి తదితర ఆనవాళ్లు కాలగర్భంలో కలిసిన ప్పటికీ కోట గోడ ఆనవాళ్లు మిగిలేఉన్నాయి. నాడు బడాజంగ్‌కు సైన్యాన్ని అందించిన బట్టేల్‌గుట్టను పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు కల్పించుకుని బట్టేల్‌గుట్ట అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

చార్మినార్‌ అందాలు

బడంగ్‌పేటలోని బట్టేల్‌గుట్ట నుంచి చూస్తే చార్మినార్‌ నాలుగు గుమ్మటాలు కనిపించేవని స్థానికులు చెబుతుంటారు. కాంక్రీట్‌ జంగిల్‌ పెరగడంతో ప్రస్తుతం కనిపించడం లేదంటున్నారు. శిథిలమవుతున్న బట్టేల్‌ గుట్టకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు బడంగ్‌పేట కార్పొరేషన్‌ అధికారులు, కార్పొరేటర్లు, ప్రస్తుత ఎమ్మెల్యే సహకారంతో రూ.2.50కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. పచ్చికబయళ్లు, పూల మొక్కలు, చుట్టూ ఇనుప కంచెతో పది పీట్ల మేర ప్రహరీ, పాలరాతి దిమ్మెలపై కూర్చుని బట్టేల్‌ గుట్ట ఫొటో తీసుకునేందుకు ఏర్పాటు చేశారు. బట్టేల్‌గుట్టపై ధ్యానముద్రలో ఉన్న పెద్ద బుద్ధిడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కోట్లు వెచ్చించి గుట్టను అభివృద్ధి చేశారు. అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవాలు చేశారు. అక్కడకు అందాల వీక్షణకు మాత్రం అనుమతి లేదు. దీంతో బట్టేల్‌ గుట్ట సందర్శనకు అనుమతించాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

త్వరలో సందర్శనార్థం



చారిత్రక ప్రాంతమైన బట్టేల్‌గుట్ట మా 30వ డివిజన్‌లో ఉండడం సంతోషం. బడంగ్‌పేటకు ఒక ఐకాన్‌ ఉండాలని భావించి బట్టేల్‌ గుట్టను బడంగ్‌పేట మున్సిపల్‌ కార్పొరేషన్‌ లోగో ముద్రను ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి కల్పించుకోకపోతే బట్టేల్‌గుట్ట ఇంకా శిథిలావస్థలోనే ఉండేది. త్వరలోనే ప్రజలకు సందర్శనకు అనుమతి కోసం కృషి చేస్తున్నాం.

– భీమిడి స్వప్న, కార్పొరేటర్‌, 30వ డివిజన్‌

మల్చింగ్‌ సాగు.. దిగుబడి బాగు



అల్లిపూర్‌ సమీపంలో మల్చింగ్‌ విధానంలో చేసిన సాగు

- నూతన పద్ధతిలో కూరగాయలు, పూల సాగు
- లాభాలు ఆర్జిస్తున్న రైతులు

ధారూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ రంగంలో సరికొత్త మెళుకువలతో ముందుకు సాగుతున్నారు. అందుబాటులో ఉండి, శాస్త్రీయ పద్ధతితో కూడుకున్న మల్చింగ్‌ సాగు రైతులకు బహుళ ప్రయోజనాలను చేకూర్చుతోంది. ఎరువులు, కూలీల ఖర్చు తగ్గడం, కలుపు నివారణతో పాటు సాగునీటి ఆదా, నాణ్యమైన అధిక దిగుబడికి మల్చింగ్‌ సాగు దోహదపడుతుందని ధారూరు మండలంలోని కేరెల్లి, కొండాపూర్‌ ఖుర్దు, అల్లిపూర్‌, బాచారం, ఎబ్బనూర్‌ తదితర గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల రైతులు డ్రిప్‌, స్ప్రింక్లర్లు, మల్చింగ్‌ కవర్లతో పాటు నూతన పద్ధతిలో ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు.

సాగు విధానం

సాగుచేసిన పైరు వేర్లను కప్పి ఉంచడమే మల్చింగ్‌. భూమిపైన ప్లాస్టిక్‌ షీట్స్‌ కప్పి బయటి వాతావరణానికి సంబంధం లేకుండా నేలలోని ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తుందని రైతులు వివరించారు. దీంతో కలుపు నివారణ 80 శాతం తగ్గుతుందన్నారు. భూమిలోని తేమ ఆవిరి కాకుండా చూస్తుందని అన్నారు. అన్ని కాలాల్లోను మల్చింగ్‌ పద్ధతిలో సాగుచేయవచ్చని.. తాము పూల తోటలు, ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నామని వెల్లడించారు. ఈ విధానంతో అధిక దిగుబడి, లాభాలు వస్తున్నాయని తెలిపారు. బోదెలను అచ్చుగా ఏర్పాటు చేసి బీర, పొట్ల, దొండ, కాకర, టమాట, వంగ, సొర తదితర కూరగాయలను పండిస్తున్నట్లు వారు వివరించారు. ఉద్యానవనశాఖ నుంచి ప్రోత్సాహం లేదు.. ప్రభుత్వం నుంచి రాయితీ లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మల్చింగ్‌ సాగు విధానాన్ని ప్రోత్సహించి రాయితీ కల్పిస్తే రైతులు లాభాల బాట పడతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

మన సేవలే గుర్తింపు

జెడ్పీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌కుమార్‌

మోమిన్‌పేట: ప్రజలకు సేవచేస్తే వారే గెలిపిస్తారని జెడ్పీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌కుమార్‌ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీకేఆర్‌ ఫంక్షన్‌ హాల్‌ మండల ప్రాదేశిక సభ్యులను సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ మాట్లాడుతూ.. తమ పాలనలో ప్రజలకు గుర్తుండిపోయేలా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సుపరిపాలనలో చీమల్‌దరి పంచాయతీకి జాతీయ అవార్డు రావడం తమ పాలనకు గుర్తింపు అన్నారు. ఇటీవల బదిలీ అయిన ఎంపీడీఓ శైలజారెడ్డి, చీమల్‌దరి మాజీ సర్పంచ్‌ నర్సింహారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వసంత వెంకట్‌ , వైస్‌ ఎంపీపీ మానస, కోఆప్షన్‌ సభ్యుడు బాగ్దాద్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్‌ శ్రీకాంత్‌గౌడ్‌, ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్‌ మనోహర్‌ చక్రవర్తి, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను సన్మానిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి తదితరులు

కూతుళ్ల వివాహాలకు అప్పులు

తీర్చే మార్గం లేక బలవన్మరణం

బొంరాస్‌పేట: ముగ్గురు కూతుళ్ల వివాహాలకు చేసిన అప్పులు తీర్చే మార్గంలేక ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని మెట్లకుంటలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎండీ రవూఫ్‌ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బైరం నర్సింలు(62), మొగులమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఓ కుమారుడు సంతానం. కూతుళ్ల పెళ్లిల్లు చేసి అప్పులపాలయ్యాడు. తరచూ భార్యకు చెప్పుకొని బాధపడుతుండేవాడు. ఉదయం ఎల్లమ్మ చెరువు వద్ద ఉన్న తన పొలంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం

యాచారం: హైదరాబాద్‌ గ్రీన్‌ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కుర్మిద్దలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన అనమోని రోశయ్య ఇంట్లో చోరీ చేసేందుకు వచ్చారు. గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో వారు పరారయ్యారు. ఈ మేరకు బుధవారం రోశయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శంకర్‌పల్లి: గుర్తు తెలియని ఓ యువకుడి మృతదేహం లభ్యమైన ఘట న బుధవారం మోకిల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మియాఖాన్‌గడ్డ చౌరస్తా సమీపంలోని పొలం వద్ద సుమారు 27 ఏళ్ల యువకుడి మృతదేహం పడి ఉంది. ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. శవాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

బాలుడిని కొట్టిన వ్యక్తికి రిమాండ్‌

షాబాద్‌: పది రోజుల క్రితం మండల పరిధిలోని కేసారం గ్రామంలో 7వ తరగతి చదువుతున్న దళిత విద్యార్థి బేగరి యాదగిరిపై అదే గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి దాడి చేశారు. ఈ ఘటనలో బుధవారం మధుసూదన్‌రెడ్డి అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ కాంతారెడ్డి అన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మున్సిపల్‌ చైర్మన్‌ అశోక్‌కుమార్‌

పరిగి: వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్‌ చైర్మన్‌ ముకుంద అశోక్‌ కుమార్‌ సూచించారు. బుధవారం ఆయన పట్టణ కేంద్రంలోని పలు నర్సరీలను పరిశీలించారు. అనంతరం చైర్మన్‌ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటయ్య, కౌన్సిలర్‌ వెంకటయ్య, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పట్టణ కేంద్రలోని 2వ వార్డులో సీసీ రోడ్డు పనులను మున్సిపల్‌ చైర్మన్‌ అశోక్‌ కుమార్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. పట్టణ కేంద్రంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లను ఏర్పాటు చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌ అర్చన రవికుమార్‌, కృష్ణ, వెంకటయ్య నాయకులు అంజనేయులు, సురేందర్‌ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అశోక్‌కుమార్‌

తిమ్మారెడ్డిపల్లిలో శిలాఫలకం ధ్వంసం

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం రద్దు

నవాబుపేట: ప్రభుత్వ కార్యక్రమానికి తమకు సమాచారం ఇవ్వలేదంటూ గ్రామస్తులు, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో ఇటీవల రూ.30లక్షల హెచ్‌ఎండీఏ నిధులతో అంతర్గత మురుకాల్వలు నిర్మించారు. రూ.పది లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ నిర్మించేందుకు నిర్ణయించారు. కాగా బుధవారం మురుగు కాల్వల ప్రారంభోత్సవం, కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య శంకుస్థాపన చేస్తారని నిర్ణయించి అధికారులు శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఇటీవల పార్టీ మారిన ఎమ్మెల్యేకు ప్రాధాన్యతనిస్తూ తమకు సమాచారం ఇవ్వలేదని పార్టీ సీనియర్‌ నాయకులు ఆగ్రహంతో ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీంతో ఈ కార్యక్రమాలు రద్దయ్యాయి. ఈ ఘటనపై పంచాయతీ రాజ్‌ డీఈ మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మోమిన్‌పేట్‌ సీఐ ఆంజనేయులు తెలిపారు.



ధ్వంసమైన శిలాఫలకం

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక..

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మధుశాన్వి

కుల్కచర్ల: హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేని ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన కుల్కచర్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సునీతరాములు దంపతుల కూతురు మధుశాన్విని 15 రోజుల క్రితం కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. నాటి నుంచి నేను హాస్టల్‌లో ఉండనంటూ తరచూ తల్లిదండ్రులకు ఫోన్‌ చేసింది. వారు హాస్టల్‌లో ఉండాల్సిందే అని గద్దించడంతో పాఠశాలలోని బ్లీచింగ్‌ పౌడర్‌ను మంచినీటిలో కలుపుకొని తాగింది. గమనించిన ఉపాధ్యాయులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం 108లో పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి నీలోఫర్‌కు రిఫర్‌చేశారని సమాచారం. ఇదే విషయమై కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవిని వివరణ కోరగా ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

చెరువులను సంరక్షించాలి



సదస్సులో మాట్లాడుతున్న గోరెంకల నర్సింహ

- మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ

మంచాల: గ్రామాల్లో రియల్‌ వ్యాపారం పేరుతో కబ్జాలకు గురవుతున్న చెరువులను ప్రభుత్వం కాపాడాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ డిమాండ్‌ చేశారు. బుధవారం మంచాల గ్రామంలో నిర్వహించిన మత్స్య కార్మిక సంఘం మండల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చెరువులను శాటిలైట్‌ ద్వారా డిజిటల్‌ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్‌ హద్దురాళ్లు ఏర్పాటు చేయించాలన్నారు. గత పదేళ్ల కాలంలో చెరువులు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురయ్యాయని మండిపడ్డారు. ఆగాపల్లి గ్రామంలో అల్లి చెరువును కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేశారని తెలిపారు. అధికారులు చోద్యం చూడడం తప్ప ఎక్కడ పనులను నిలుపుదల చేయలేదన్నారు. ఇరిగేషన్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించక పోవడం శోచనీయమన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగిస్తూ, మత్స్యకారుల సొసైటీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.5,000 కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చనమోని శంకర్‌, జిల్లా నాయకుడు శర్మ, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ, వివిధ గ్రామాల సొసైటీల అధ్యక్షులు, నాయకులు కృష్ణ, యాదగిరి, చక్రపాణి, భిక్షపతి, గిరిప్రసాద్‌, శ్రీనివాస్‌, జంగయ్య, భాస్కర్‌, యాదయ్య, హన్మంత్‌, రవి, కృష్ణ, పాపయ్య, జగన్‌, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరు

- నీటి పారుదల శాఖ జిల్లా అధికారి సుందర్‌నాయక్‌
- చెరువులు, ప్రాజెక్టుల పరిశీలన

మర్పల్లి: వికారాబాద్‌ నియోజకవర్గ పరిధిలో ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు చెరువులు, ప్రాజెక్టులు పరిశీలిస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నీటి పారుదల శాఖ జిల్లా అధికారి సుందర్‌ నాయక్‌ అన్నారు. శాసన సభ స్పీకర్‌, ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ ఆదేశాల మేరకు బుధవారం వారు మండల పరిధిలోని సిరిపురం, వీర్లపల్లి, పంచలింగాల, కోట్‌మర్పల్లి, రావులపల్లి, కల్‌కోడ చెరువులతో పాటు కొంషెట్‌పల్లి ప్రాజెక్టుల్లో నెలకొన్న పూడికతీత, అలుగు, గేట్ల మరమ్మతులతో పాటు సాగునీరు అందించే కాల్వల స్థితిగతులను పరిశీలించారు. కొంషెట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఎస్‌ఈ సుందర్‌నాయక్‌ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మరమ్మతు పనులకు పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వక పోవడంతో ఆయకట్టు భూములు బీడుపడ్డాయన్నారు. స్పీకర్‌ ఆదేశాల మేరకు చెరువులు, ప్రాజెక్టులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఈ పరిశీలనలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు మాణిక్‌రెడ్డి, గూడెం రాములు యాదవ్‌, మండల వర్కింగ్‌ ప్రసిడెంట్‌ తుమ్మల సురేశ్‌, ఇరిగేషన్‌ ఈఈ భాస్కర్‌గౌడ్‌, డీఈ వరప్రసాద్‌, ఏఈ, మండల నాయకులు రఫీ, రాచన్న, సాయి, పాండు, నర్సింహారెడ్డి, అబ్రహం, బంట్వారం మండల అధ్యక్షుడు వెంకట్‌, రమేష్‌ తదితరులున్నారు.



కొంషెట్‌పల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్‌ అధికారి తదితరులు

హాస్టల్‌ ఏర్పాటుకు వినతి

ఆమనగల్లు: పట్టణంలో ఇంటర్‌, డిగ్రీ చదువుతున్న విద్యార్థుల కోసం షెడ్యూల్‌ కులాల సంక్షేమ కళాశాల హాస్టల్‌ ఏర్పాటు చేయాలని సోషలిస్ట్‌ విద్యార్థి సంఘం కోఆర్డినేటర్‌ శంకర్‌ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టర్‌ కార్యాలయ ఆవరణలోని సోషల్‌ వెల్ఫేర్‌ డిప్యూటీ డైరెక్టర్‌ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.



సోషల్‌ వెల్ఫేర్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న శంకర్‌ తదితరులు

‘రైతు భరోసా’కే అభిప్రాయ సేకరణ

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



తలకొండపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు/తలకొండపల్లి: రైతుకు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పడకల్‌ గేట్‌ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పై రైతులు, ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాహాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రుణమాఫీ చేస్తామని, సాగు చేసే ప్రతీ ఎకరాకు రైతు భరోసా అందిస్తామని.. రైతుబీమా అమలు చేస్తామన్నారు. అనంతరం పీఏసీఎస్‌ చైర్మన్‌ గట్ల కేశవరెడ్డి రైతుల అభిప్రాయాన్ని చెప్పాలని కోరారు. సాగు ప్రారంభానికి ముందే పెట్టుబడులకు అందేలా రైతు భరోసా ఇవ్వాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం అధికారి కేఎల్‌ఎన్‌ చారి, సహకార సంఘం జిల్లా అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ శారద, ఏఓ రాజు, శతాబ్ది శ్రీనివాస్‌ రెడ్డి, సింగిల్‌విండో సీఈఓ ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు యాదయ్య, శ్రీనివాసులు, దేవులా నాయక్‌, ఎంపీటీసీ సభ్యులు రమేశ్‌, సుధాకర్‌రెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌ గౌడ్‌, భగ్‌వాన్‌ రెడ్డి, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

గ్రామాలు, తండాల్లో రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శెట్టిపల్లి మాజీ సర్పంచ్‌ ఎగిరిశెట్టి సత్యం బుధవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కసిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వేముల చెరువు కట్టపై రోడ్డు నిర్మించాలని కోరారు. వీరన్న చెరువు చెక్‌డ్యాంకు ఫీడర్‌ కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ–82 కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తామని, త్వరగా సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వాసుపత్రులను ఆధునీకరించాలని, పక్కా భవనాలు నిర్మించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహను కోరానని కసిరెడ్డి చెప్పారు.